

కుర్రాళ్ల కొట్లాట

మధ్యాహ్నం • 1.30

నేడు అండర్-19 ప్రపంచకప్ ఫైనల్ • భారత్ x ఆస్ట్రేలియా

అండర్-19 ప్రపంచకప్‌లో అపజయం ఎరగకుండా దూసుకెళ్తున్న యువభారత జట్టు.. నేడు టైటిల్ ఫైట్‌లో ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. రికార్డు స్థాయిలో తొమ్మిదో ఫైనల్ ఆడుతున్న యంగ్‌ఇండియా.. ఆరోసారి కప్పు కొడుతుందా.. లేక సీనియర్ల మాదిరిగా కంగారూల చేతిలో కంగుతింటుందా నేడు తేలనుంది!

బెనోనీ: అప్రతిహత విజయాలతో దూకుడు మీద ఉన్న యువ భారత జట్టు.. ఆదివారం అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. టోర్నీ చరిత్రలో మరే జట్టుకు సాధ్యం కాని రీతిలో ఇప్పటి వరకు ఐదుసార్లు జగజ్జేతగా నిలిచిన యంగ్ ఇండియా సిక్సర్ బాదాలని చూస్తుంటే.. సీనియర్ల వరల్డ్‌కప్ ఫైనల్లో రోహిత్‌సేనను ఓడించినట్లు.. యువభారత్‌ను నిలువరించాలని కంగారూలు కాచుకొని ఉన్నారు. లీగ్ దశ మొదలుకొని.. సెమీస్ వరకు ప్రతి జట్టుపై సాధికారిక విజయం సాధించి ముందడుగు వేసిన యంగ్‌ఇండియా తుదిపోరులోనూ అదే దూకుడు కొనసాగించాలని చూస్తున్నది. కెప్టెన్ ఉదయ్ సహరన్‌తో పాటు అర్షిన్ కులకర్ణి, ముషీర్ ఖాన్, సచిన్ దాస్ మంచి ఫామ్‌లో ఉండటం భారత్‌కు కలిసొచ్చే అంశం. ఇప్పటికే ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కించుకున్న తెలంగాణ కుర్రాడు అరవెల్లి అవనీశ్‌రావుతో వికెట్ కీపర్‌గా తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నాడు. బౌలింగ్‌లో రాజ్ లింబాని, నమన్ తివారి, సామీ కుమార్, మురుగన్ అభిషేక్ కీలకం కానున్నారు. గతంలో అండర్-19 స్థాయిలో మెరిసి ఆ తర్వాత అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన యువరాజ్ సింగ్, మహమ్మద్ కైఫ్, సురేశ్ రైనా, శిఖర్ ధవన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజా, రాహుల్, పంత్, గిల్, యశస్వి మాదిరిగా.. పేరు ప్రఖ్యాతులు దక్కించుకునేందుకు కుర్రాళ్లకు ఇది చక్కటి అవకాశం కానుంది. మరోవైపు గతంలో రెండుసార్లు (2012, 2018లో) తుదిమెట్టుపై భారత్ చేతిలో ఓడిన ఆసీస్.. ఈసారి కప్పు కొట్టాలని కృతనిశ్చయంతో ఉంది.

కోహ్లీ లేకుండానే

భారత జట్టు ఎంపిక

- అందుబాటులో లేని విరాట్
- శ్రేయస్‌పై వేటు
- ఆకాశ్‌కు పిలుపు

అనుమానం నిజమైంది! వ్యక్తిగత కారణాలతో ఇంగ్లండ్‌తో తొలి రెండు మ్యాచ్‌లకు అందుబాటులో లేని మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ.. మొత్తం సిరీస్‌కు దూరమయ్యాడు. గాయాల బారిన పడ్డ కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా తిరిగి జట్టులోకి రాగా.. మిడిలార్డర్‌లో ఆకట్టుకోలేకపోతున్న శ్రేయస్ అయ్యర్‌పై సెలెక్షన్ కమిటీ వేటు వేసింది. వైజాగ్ టెస్టుకు రెస్టు తీసుకున్న హైదరాబాదీ పేసర్ మహమ్మద్ సిరాజ్ తిరిగి జట్టుకు ఎంపిక కాగా.. బీహార్ పేసర్ ఆకాశ్‌కు తొలిసారి టీమ్‌ఇండియా నుంచి పిలుపు వచ్చింది.

న్యూఢిల్లీ: పరుగుల రారాజు విరాట్ కోహ్లీ.. ఇంగ్లండ్‌తో సిరీస్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. వ్యక్తిగత కారణాల వల్ల తొలుత రెండు మ్యాచ్‌లకు దూరమైన కోహ్లీ.. ఇప్పుడు మొత్తం సిరీస్ నుంచే తప్పుకున్నాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలువగా.. మిగిలిన మూడు మ్యాచ్‌ల కోసం బీసీసీఐ సీనియర్ సెలెక్షన్ కమిటీ శనివారం 17 మందితో కూడిన జట్టును ప్రకటించింది. కెరీర్ ఆరంభం నుంచే సుదీర్ఘ ఫార్మాట్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ వచ్చిన కోహ్లీ లేకపోవడం భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బే! 'వ్యక్తిగత కారణాలతో మిగిలిన సిరీస్‌కు విరాట్ అందుబాటులో ఉండటం లేదని వెల్లడించాడు. అందుకే అతడిని సెలెక్షన్ పరిగణనలోకి తీసుకోలేదు. కోహ్లీ నిర్ణయాన్ని బోర్డు గౌరవిస్తున్నది' అని బీసీసీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమ్‌ఇండియా పరాజయం పాలవగా.. వైజాగ్ మ్యాచ్‌లో నెగ్గి రోహిత్ సేన సిరీస్ సమం చేసింది. ఇక ఇరు జట్ల మధ్య ఈ నెల 15 నుంచి రాజ్‌కోట్ వేదికగా మూడో మ్యాచ్ మొదలు కానుంది. గాయాల కారణంగా గత మ్యాచ్‌కు దూరమైన కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా తిరిగి జట్టులో చేరారు. రాహుల్ పూర్తిగా కోలుకోగా.. జడేజా మ్యాచ్ ఆరంభం వరకు ఫిట్‌నెస్ సాధించే అవకాశాలున్నాయి. వీరిద్దరి రాకతో.. వైజాగ్ టెస్టు ద్వారా అరంగేట్రం చేసిన రజత్ పాటిదార్ బెంచ్‌కే పరిమితం కావాల్సి రావచ్చు. ఇక వెన్ను నొప్పితో బాధపడుతున్న శ్రేయస్ అయ్యర్‌పై సెలెక్షన్ కమిటీ వేటు వేసింది. కోహ్లీ, పుజారా, రహానే, రాహుల్ వంటి సీనియర్ల గైర్హాజరీలో.. మిడిలార్డర్‌లో బాధ్యత తీసుకోవాల్సిన శ్రేయస్ పెద్దగా ప్రభావం చూపకపోవడంతో అతడిని జట్టుకు ఎంపిక చేయలేదు. ఇక చాన్నాళ్ల నిరీక్షణ తర్వాత భారత జట్టుకు ఎంపికై మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ చోటు నిలుపుకున్నాడు. పేస్ ఆల్‌రౌండర్ ఆకాశ్‌దీప్‌కు తొలిసారి అవకాశం వచ్చింది. ఇటీవల ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌ల్లో రాణించిన ఆకాశ్‌దీప్ ప్రతిభను సెలెక్టర్లు గుర్తించారు. విశ్రాంతి అనంతరం సిరాజ్ తిరిగి జట్టులో చేరగా.. అవేశ్ ఖాన్, సౌరభ్‌కుమార్‌ను రంజీలు ఆడేందుకు అనుమతిచ్చారు.

భారత జట్టు: రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, రాహుల్, రజత్ పాటిదార్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, భరత్, అశ్విన్, జడేజా, అక్షర్, సుందర్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్, ముఖేశ్, ఆకాశ్‌దీప్.

అయినవాళ్లను కోల్పోయి

చదువు సంధ్యలు మానేసి.. క్రికెట్, క్రికెట్ అని తిరుగుతున్న ఆ కుర్రాడితో సహవాసం చేస్తే.. తమ పిల్లలు చెడిపోతారని వారించిన చుట్టుపక్కల వాళ్ల తల్లిదండ్రులే ఈ రోజు.. అతడికి అభినందనలు తెలిపేందుకు ఇంటిముందు లైన్ కట్టారు. కనీసం కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైనా.. ఇల్లు గడుస్తుందని మొర పెట్టుకున్న ఆ తల్లి సంతోషానికి ఇప్పుడు అవధులు లేవు. ఇదంతా భారత టెస్టు జట్టుకు ఎంపికైన అకాశ్‌దీప్ గురించే! బీహార్‌లోని సస్రామ్‌కు చెందిన కుడిచేతివాటం మీడియం పేసర్‌కు తొలిసారి బీసీసీఐ సెలెక్షన్ కమిటీ నుంచి పిలుపువచ్చింది. చిన్నప్పటి నుంచి క్రికెటే శ్వాసగా ధ్యాసగా పెరిగిన 27 ఏండ్ల ఆకాశ్.. రంజీ ట్రోఫీలో బెంగాల్ తరఫున మ్యాచ్ ఆడుతున్న సమయంలో ఈ విషయం అతడి చెవిన పడింది. దీంతో అతడి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆరు నెలల వ్యవధిలో అటు తండ్రిని, ఇటు సోదరుడిని కోల్పోయి పుట్టెడు కష్టాలు ఎదుర్కొన్న ఆకాశ్.. భారత జట్టు తరఫున రాణించడమే తన ముందున్న ఏకైక లక్ష్యమని అంటున్నాడు. 'త్వరలోనే భారత జట్టుకు ఎంపికవుతానని చాన్నాళ్లుగా అనుకుంటున్నా. ఆ అద్భుత క్షణం రానేవచ్చింది. ఆరు నెలల వ్యవధిలో తండ్రి, అన్నయ్యను కోల్పోయా. ఈ వార్త వాళ్లు విని ఉంటే చాలా సంతోషించేవారు' అని అన్నాడు.

ఫైనల్లో నాగల్

చెన్నై: ఇటీవలి కాలంలో నిలకడగా రాణిస్తున్న భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమీత్ నాగల్.. చెన్నై ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో రెండో సీడ్ నాగల్ 6-3, 6-4తో డాలిబర్ (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించాడు. దాదాపు రెండు గంటల పాటు సాగిన పోరులో నాగల్ వరుస సెట్లలో విజృంభించాడు. ఆదివారం జరగనున్న తుదిపోరులో టాప్ సీడ్ లూకా నార్డీ (ఇటలీ)తో నాగల్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

ధోనీ సారథ్యంలో ఆడాలనేది నా కల

బెనోనీ: దేశంలో క్రికెట్ బ్యాట్ పట్టిన ప్రతీ ప్లేయర్ మహేంద్రసింగ్ దోనీ సారథ్యంలో ఆడాలనుకుంటాడని.. భారత అండర్-19 జట్టు వికెట్ కీపర్ అరవెల్లి అవనీశ్ రావు అన్నాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో ఈ తెలంగాణ కుర్రాడిని ధోనీ సారథ్యంలోని చెన్నై సూపర్ కింగ్స్ జట్టు కొనుగోలు చేసుకుంది. ఆస్ట్రేలియాతో అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌కు ముందు అవనీశ్ మాట్లాడుతూ.. 'ధోనీ సార్ సారథ్యంలో ఆడాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అసలు చెన్నై జట్టుకు ఎంపికైనప్పుడు నమ్మలేకపోయా. అయితే ప్రస్తుతం వరల్డ్‌కప్ గురించే ఆలోచిస్తున్నా. ఆ తర్వాత ఐపీఎల్‌పై దృష్టి పెడతా. చెన్నై జట్టుకు ఏం అవసరమో అది చేసేందుకు సిద్ధంగా ఉన్నా' అని అన్నాడు.

పసిడి పోరుకు నిఖత్

స్ట్రాంజా బాక్సింగ్ టోర్నీ

సోఫియా (బల్గేరియా): రెండుసార్లు ప్రపంచ చాంపియన్, తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్.. స్ట్రాంజా మెమోరియల్ టోర్నీ ఫైనల్లోకి ప్రవేశించింది. బల్గేరియా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ మహిళల 50 కేజీల సెమీఫైనల్లో శనివారం నిఖత్ 5-0తో స్థానిక బాక్సర్ చుకునవాపై ఘన విజయం సాధించింది. తొలి రౌండ్‌లో కాస్త వెనుకబడ్డ ఈ ఇందూరు బాక్సర్ ఆ తర్వాత తన పంచ్ పవర్ చాటింది. వరుస పంచ్‌లతో ప్రత్యర్థిపై విరుచుకుపడింది. జాబ్‌లు, హుక్‌లతో బల్గేరియా బాక్సర్‌ను ముప్పుతిప్పలు పెట్టడంతో మ్యాచ్‌ను ముగించింది. ఆదివారం జరగనున్న స్వర్ణ పతక పోరులో సబీనాతో నిఖత్ తలపడనుంది. పురుషుల విభాగంలో అమిత్ పంగాల్ తుదిపోరుకు అర్హత సాధించాడు. ఈ ఇద్దరితో పాటు మరో నలుగురు భారత బాక్సర్లు కూడా ఫైనల్లో అడుగుపెట్టారు. అరుంధతి (66 కే), బరున్ (48 కే), సచిన్ (57 కే), రజత్ (67 కే) ఈ జాబితాలో ఉన్నారు.

హర్మన్ డబుల్

భువనేశ్వర్: కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డబుల్ ధమాకా మోగించడంతో ఎఫ్‌ఐహెచ్ హాకీ ప్రో లీగ్‌లో భారత్ ఘనవిజయం సాధించింది. శనివారం జరిగిన పోరులో భారత్ 4-1తో స్పెయిన్‌ను మట్టికరిపించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ (7వ, 20వ నిమిషాల్లో) రెండు గోల్స్ బాదగా.. జుగ్‌రాజ్ సింగ్ (24వ ని.లో), లలిత్ కుమార్ ఉపాధ్యాయ్ (50వ ని.లో) ఒక్కో గోల్ కొట్టారు. స్పెయిన్‌కు మార్క్ ఏకైక గోల్ అందించాడు.

తిప్పేసిన తనయ్

7 వికెట్లతో విజృంభణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: లెఫ్టార్మ్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ 7 వికెట్లతో సత్తా చాటడంతో.. రంజీట్రోఫీ ప్లేట్ గ్రూప్ సెమీఫైనల్లో హైదరాబాద్ విజయానికి బాటలు వేసుకుంది. నాగాలాండ్‌తో జరుగుతున్న పోరులో హైదరాబాద్ 462/8 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన నాగాలాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 206 పరుగులకు ఆలౌటైంది. జాషువ (50) టాప్ స్కోరర్ కాగా.. మన బౌలర్లలో తనయ్ 7, రవితేజ రెండు వికెట్లు తీశారు. భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడంతో హైదరాబాద్ జట్టు ప్రత్యర్థికి ఫాలోఆన్ విధించింది. దీంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నాగాలాండ్.. శనివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 20 పరుగులు చేసింది. చేతిలో 9 వికెట్లు ఉన్న నాగాలాండ్.. మన స్కోరుకు ఇంకా 236 పరుగుల దూరంలో ఉంది.

పట్నా ఘనవిజయం

కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-10లో పట్నా పైరెట్స్ ప్లేఆఫ్స్‌కు చేరువైంది. శనివారం జరిగిన పోరులో పట్నా 44-23 తేడాతో యూ ముంబాను చిత్తు చేసి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి ఎగబాకింది. పట్నా తరఫున సచిన్ 10 పాయింట్లు సాధించగా.. కిషన్ (8 పాయింట్లు), సుధాకర్ (7 పాయింట్లు) రాణించారు. ముంబా తరఫున అమీర్ (12 పాయింట్లు) ఒంటరి పోరాటం చేశాడు. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 55-35 తేడాతో తెలుగు టైటాన్స్‌ను చిత్తుచేసింది.

గోల్డ్ బాండ్ ధర గ్రాముకు 6,263

రేపటి నుంచి ఇష్యూ ప్రారంభం

ముంబై, ఫిబ్రవరి 10: తాజాగా జారీచేసే సావరిన్ గోల్డ్ బాండ్ ధరను గ్రాముకు రూ.6,263గా నిర్ణయించినట్టు రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ 2023-24-నాల్గవ సిరీస్ ఇష్యూ ఈ నెల 12 నుంచి ప్రారంభమై, ఐదు రోజులు అమలులో ఉంటుంది. చివరకు ఈ నెల 16న ముగుస్తుంది. ఇండియన్ బులియన్ జ్యువెల్లర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రకటించే మూడు రోజుల బంగారం సగటు ధర (ఇష్యూకు ముందు మూడు పనిదినాల ముగింపు ధర) ఆధారంగా గోల్డ్ బాండ్లకు ధర నిర్ణయిస్తారు. బాండ్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, డిజిటల్ రూపంలో చెల్లింపులు జరిపే మదుపుదారులకు నిర్ణీత ధరకంటే గ్రాముకు రూ.50 చొప్పున కేంద్ర ప్రభుత్వం డిస్కౌంట్ ఇస్తుంది. అంటే వారికి గోల్డ్ బాండ్ రూ.6,213 ధరకు లభిస్తుందని ఆర్బీఐ తెలిపింది. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంక్‌లు, ఎంపికచేసిన పోస్టాఫీసులు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, బొంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా ఈ బాండ్లను ఆర్బీఐ విక్రయిస్తుంది.

- గోల్డ్ బాండ్లకు వాటి ముఖవిలువపై 2.50 శాతం వార్షిక వడ్డీని ఆరు నెలలకు ఒకసారి చొప్పున కేంద్ర ప్రభుత్వం తరపున ఆర్బీఐ ఇస్తుంది.
- ఈ సావరిన్ గోల్డ్ బాండ్ కాలపరిమితి ఎనిమిదేండ్లు కాగా, 5వ సంవత్సరం తర్వాత ముందుగానే రిడీమ్ చేసుకునే అవకాశం ఉన్నది.
- రుణాలు పొందేందుకు ఈ బాండ్లను తనఖాగా ఉపయోగించుకోవచ్చు.
- బంగారం కొనుగోలుకు వర్తించే కేవైసీ నిబంధనలే గోల్డ్ బాండ్లకూ వర్తిస్తాయి.

పీఎఫ్ ఖాతాదారులకు తీపికబురు

8.25 శాతానికి వడ్డీని పెంచిన ట్రస్టీల బోర్డు • మూడేండ్ల గరిష్ఠానికి చేరుకున్న రేటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) వడ్డీ రేటును మూడేండ్ల గరిష్ఠస్థాయికి పెంచింది. మార్చి 31తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి ప్రావిడెంట్ ఫండ్ నిధులపై 8.25 శాతం వడ్డీ చెల్లించాలని నడిచే ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) ట్రస్టీల కేంద్ర బోర్డు నిర్ణయించినట్టు కార్మిక శాఖ తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖకు సిఫార్సుచేసింది. వడ్డీ రేట్ల పెంపుదల 8 కోట్ల మంది ఈపీఎఫ్ చందాదారులకు ప్రయోజనం చేకూరుతుంది. గత మూడేండ్లలో ఇదే అత్యధిక రేటు. 2019-20లో 8.5 శాతం వడ్డీని చెల్లించిన ఈపీఎఫ్‌వో 2020-21లో సైతం అదే రేటును కొనసాగించింది. అటుతర్వాత 2021-22లో వడ్డీ రేటును ఒకేసారి నాలుగు దశాబ్దాల కనిష్ఠస్థాయి 8.1 శాతానికి తగ్గించింది (1977-78లో 8 శాతం). 2022-23లో స్వల్పంగా పెంచి 8.15 శాతం చెల్లించింది. 2023-24 సంవత్సరానికి తాజాగా ప్రకటించిన 8.25 శాతం రేటు సిఫార్సు ఆర్థిక శాఖ చెంతకు వెళుతుంది. దానికి ఆమోదం అందుకున్న తర్వాత ఈపీఎఫ్ చందాదారుల పీఎఫ్ ఖాతాల్లో వడ్డీని జమచేస్తారు. కార్మిక, ఉపాధి శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అధ్యక్షతన శనివారం జరిగిన ఈపీఎఫ్‌వో ట్రస్టీల బోర్డు 235వ సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేటును పెంచాలని నిర్ణయించినట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. ఆర్థిక శాఖ అనుమతి లభించిన తర్వాత కొత్త వడ్డీ రేటుపై గెజిట్ నోటిఫికేషన్ వెలువడుతుందని, ఆమోదిత రేటుపై వడ్డీని ఈపీఎఫ్‌వో చందాదారుల ఖాతాల్లో జమచేస్తుందని ప్రకటన వివరించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ సభ్యుల ఖాతాల్లో ఉన్న అసలు మొత్తం రూ.13 లక్షల కోట్లుకాగా, దానికి రూ.1,07,000 కోట్లు వడ్డీ చెల్లించాలని బోర్డు సిఫార్సుచేసింది. గత ఏడాది రూ.11.02 లక్షల కోట్ల అసలుపై రూ.91,151 కోట్ల వడ్డీని జమచేశారు. తాజాగా సిఫార్సుచేసిన వడ్డీ సొమ్ము రికార్డు గరిష్ఠమని, అసలు 17.97 శాతం పెరిగినందున, వడ్డీ చెల్లింపు మరింత అధికమయ్యిందని ప్రకటన పేర్కొంది.

2010 నుంచి ఎంతెంత వడ్డీ

ఏడాది	వడ్డీ రేటు శాతం
2010-11	9.50
2011-12	8.25
2012-13	8.50
2013-14	8.75
2014-15	8.75
2015-16	8.80
2016-17	8.65
2017-18	8.55
2018-19	8.65
2019-20	8.50
2020-21	8.50
2021-22	8.10
2022-23	8.15
2023-24	8.25 (సిఫార్సు)

వాణిజ్య

బీవోఎం వడ్డీరేట్ల పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) రుణగ్రహీతలకు షాకిచ్చింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో వాహన, వ్యక్తిగత, గృహ రుణాలు మరింత ప్రియంకానున్నాయి. పెరిగిన వడ్డీరేట్లు అమలులోకి వచ్చాయి. ఐదు నెలల క్రితం అక్టోబర్ 11, 2023లో వడ్డీరేట్లను సవరించిన బ్యాంక్..మళ్లీ ఇప్పుడు పెంచింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8 శాతం నుంచి 8.10 శాతానికి చేరుకోగా, నెల రోజుల రుణాలపై రేటు 8.20 శాతం నుంచి 8.30 శాతానికి, మూడు నెలల రుణాలపై రేటు 8.40 శాతానికి పెంచింది. అలాగే ఆరు నెలల కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటును 8.50 శాతం నుంచి 8.60 శాతానికి సవరించిన బ్యాంక్..ఏడాది రుణాలపై రేటును 8.80 శాతానికి పెంచింది.

మరిన్ని జనరిక్ ఔషధాలు

మెడ్‌ప్లస్ సీఈవో మధుకర్ రెడ్డి

MedPlus

హైదరాబాద్, ఫిబ్రవరి 10: ప్రముఖ ఔషధ రిటైల్ దిగ్గజం మెడ్‌ప్లస్..జనరిక్ ఔషధాలపై ప్రత్యేక దృష్టి సారించింది. స్టోర్ జనరిక్ కాన్సెప్ట్‌తో కస్టమర్లకు నాణ్యమైన జనరిక్ ఔషధాలను అందించాలనే ఉద్దేశంతో సొంత బ్రాండ్‌తో ఔషధాలను విక్రయిస్తున్నది. ఆరు నెలల క్రితం హైదరాబాద్‌లో ప్రారంభించిన ఈ స్టోర్ జనరిక్ కాన్సెప్ట్‌తో కస్టమర్లకు 50 శాతం నుంచి 80 శాతం వరకు తగ్గింపు ధరతో అందిస్తుండటంతో కోట్లాది రూపాయలు ప్రయోజనం చేకూరిందని కంపెనీ ఎండీ, సీఈవో మధుకర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం 600 జనరిక్ ఔషధాలను మెడ్‌ప్లస్ బ్రాండ్‌తో విక్రయిస్తున్నట్లు, భవిష్యత్తులో వీటిని 800కి పెంచుకోవాలనుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. కస్టమర్లకు నాణ్యమైన జనరిక్ ఔషదాలను అందించడానికి పలు సంస్థలతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు, దీంట్లోభాగంగా అకూమ్స్ డ్రగ్ అండ్ ఫార్మా, విండ్‌లాస్ బయోటెక్ వంటి అగ్రగామి సంస్థలతోనూ జతకట్టినట్టు చెప్పారు. స్టోర్ జనరిక్ మెడిసిన్లలో 26 లక్షల మంది కస్టమర్లకు రూ.139 కోట్లు ఆదా అయ్యాయి. ఆరు నెలల క్రితం తెలంగాణతోపాటు ఆరు రాష్ర్టాల్లో ఈ ప్రత్యేక మాడల్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం సంస్థకు 4,200 అవుట్‌లెట్లు ఉండగా, వచ్చే ఏడాదికాలంలో మరో 600 స్టోర్లను ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

విమాన ఇంధనాలపై పన్నులు తగ్గించండి

రాష్ర్టాలకు, యూటీలకు సింధియా సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: విమాన ఇంధనాలపై విధిస్తున్న సుంకాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలితప్రాంతాలకు పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్యా సింధియా సూచించారు. కరోనా వైరస్‌తో కుదేలైన దేశీయ విమానయాన రంగం తిరిగి వృద్ధి బాటపట్టిందని, అయినప్పటికీ అధిక పన్నులతో కొంతమేర ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నదని మంత్రి వ్యాఖ్యానించారు. విమానయాన సంస్థ నిర్వహణలో ఇంధనం కోసం పెట్టే ఖర్చు 40 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం 12 రాష్ర్టాలు, యూటీలు జెట్‌ప్యూయల్‌పై 1-4 శాతం వరకు వ్యాట్‌ను విధిస్తుండగా, మిగతా రాష్ర్టాలు 20-30 శాతం వరకు వసూలు చేస్తున్నాయని చెప్పారు.

ఎఫ్‌డీలపై బ్యాంకుల్లో ఆకర్షణీయ వడ్డీ

ఒకేసారి వడ్డీరేట్లు పెంచిన ఆరు బ్యాంక్‌లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: డిపాజిట్లను ఆకట్టుకోవడానికి బ్యాంకులు ప్రయత్నాలను వేగవంతం చేశాయి. ఇప్పటికే పలు బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీరేట్లను పెంచగా..తాజాగా ఈ జాబితాలోకి మరో ఆరు బ్యాంకులు చేరాయి. బ్యాంకింగ్ దిగ్గజాలైన ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఐవోబీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలతో పాటు మరో రెండు బ్యాంకులు ఉన్నాయి. ఈ కొత్త వడ్డీరేట్లు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. వీటిలో బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ డిపాజిట్లపై వడ్డీని ఇటీవల పెంచిన విషయం తెలిసిందే. సీనియర్ సిటిజన్లకు 8 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నది. ఎఫ్‌డీలపై మిగతా బ్యాంకులు ఇస్తున్న వడ్డీరేట్ల వివరాలు..

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ):

444 రోజుల కాలపరిమితి కలిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును 7.10 శాతం నుంచి 7.30 శాతానికి సవరించింది. ఈ ప్రత్యేక స్కీం మార్చి 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నది. సీనియర్ సిటిజన్లకు మరో అర శాతం అధికంగా వడ్డీని చెల్లించనున్నది బ్యాంక్.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర:

ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) ప్రత్యేకంగా సీనియర్ సిటిజన్లకు 200 రోజుల కాలపరిమితి డిపాజిట్లపై 7.50 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. అలాగే 365 రోజుల ఎఫ్‌డీలపై 7 శాతం. అలాగే ఏడాది నుంచి మూడేండ్ల టర్మ్ డిపాజిట్లపై 6.75 శాతం, ఐదేండ్లకంటే అధిక డిపాజిట్లపై 6.50 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది.

యాక్సిస్ బ్యాంక్:

ప్రత్యేక డిపాజిట్ స్కీంలను ప్రవేశపెట్టింది యాక్సిస్ బ్యాంక్. సీనియర్ సిటిజన్లకు కనీసంగా 7.85 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్న బ్యాంక్..ఏడాది కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై 7 శాతం వడ్డీని చెల్లిస్తున్నది. అలాగే ఏడాది నుంచి 15 నెలలోపు ఎఫ్‌డీలపై 7.20 శాతం, 15 నెలల నుంచి 17 నెలల్లోపు డిపాజిట్లపై 7.60 శాతం వడ్డీని చెల్లిస్తున్నది.

ఐవోబీ కొత్తగా 88 శాఖలు

ఐవోబీ 88వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా ఈ ఏడాది కొత్తగా 88 శాఖలను ప్రారంభించాలనుకుంటున్నది. బ్యాంక్ ఎండీ అజయ్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. 1937లో చిన్న స్థాయిలో ప్రారంభమైన ఐవోబీ అంచెలంచెలుగా ఎదుగుతూ దేశవ్యాప్తంగా విస్తరించినట్లు, ఈ ఏడాది కొత్తగా 88 శాఖలను ప్రారంభించాలనుకుంటున్నట్లు చెప్పారు.

ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోస్ ఆలుక్కాస్ సొగసైన వజ్రాభరణాల కలెక్షన్‌ను సుప్రసిద్ధ మాడల్ రాఫెల్లా సిక్వేరా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జోస్ ఆలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కాలు హాజరయ్యారు.

యమహా కొత్త బైకు

ధర రూ.1.39 లక్షలు

చెన్నై, ఫిబ్రవరి 10: ద్విచక్ర వాహన సంస్థ యమహా మోటర్.. దేశీయ మార్కెట్లోకి సరికొత్త మాడల్‌ను పరిచయం చేసింది. మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన మోటర్‌సైకిల్ ఎఫ్‌జెడ్-ఎక్స్ బైకును మార్కెట్లోకి విడుదల చేసింది. ఢిల్లీ షోరూంలో ఈ బైకు ధర రూ.1.39 లక్షలుగా నిర్ణయించింది. 149 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకులో ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, సింగిల్-చానెల్ ఏబీఎస్ వంటి ఫీచర్లతో రూపొందించింది సంస్థ.

APrinted and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.